
## సామూహిక వందే మాతరం గీతాలాపన


2


2

## అర్ధరాత్రి వాహనాల తనిఖీలు..


AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in

## మలావత్ పూర్ణకు పితృవియోగం



**అక్షరటుడే, ఇందూరు** : అత్యంత చిన్న వయస్సులో ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించిన మలావత్ పూర్ణ కు పితృవియోగం కలిగింది. ఆమె తండ్రి దేవీదాస్ (50) అనారోగ్యంతో మరణించారు. కొంతకాలంగా కామారెడ్డిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి లో కోమాలో ఉన్న ఆయన శుక్రవారం ఉదయం కన్నుమూశారు. అంత్యక్రియలు సాయంత్రం ఆయన స్వస్థలమైన సిరికొండ మండలం పాకాలలో నిర్వహించారు.





## రామారెడ్డి మండలాన్ని మరింత అభివృద్ధి చేస్తాం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** రామారెడ్డి మండలాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే మదన్ మోహన్ అన్నారు. రామారెడ్డి మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో రూ.40 లక్షల విలువైన అభివృద్ధి పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఇటీవల కురిసిన భారీవర్షాల కారణంగా కాలనీలో రోడ్లు, డ్రెయినేజీలు దెబ్బతినగా.. స్థానిక కాంగ్రెస్ నాయకులు, ప్రజల విజ్ఞప్తిపై ఎమ్మెల్యే మదన్ మోహన్ స్పందించి.. సీఆర్ఆర్ నిధుల ద్వారా రూ. 40లక్షలు మంజూరు చేశారు. అనంతరం శుక్రవారం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామారెడ్డి మండలంలోని ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, గంగమ్మ వాగుపై వంతెన, రామారెడ్డి రామాలయ దేవస్థానం, కాలభైరవ స్వామి ఆలయ అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్టీసీ అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకం



**అక్షరటుడే, ఇందూరు:** ఆర్టీసీ అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకమని రీజినల్ మేనేజర్ జ్యోత్స్న అన్నారు. నిజామాబాద్-1 డిపోలో శుక్రవారం ఉద్యోగులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఇందులో భాగంగా ఆమె మాట్లాడుతూ.. క్రమశిక్షణ, సేవాభావం, సురక్షిత ప్రయాణం.. ఇవే సంస్థ బలాలు అని పేర్కొన్నారు. అవార్డులు కృషికి గుర్తింపు మాత్రమే కాదని.. ఇతరులకు ప్రేరణ అని తెలిపారు. అనంతరం ఆయిల్ సేవింగ్, ఆదాయ వృద్ధి, తదితర అంశాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన డ్రైవర్లు, కండక్టర్లు, టైం డ్రైవర్లు, పీహెచ్‌బీ డ్రైవర్లు, టెక్నీషియన్లు, శ్రామికులకు సర్టిఫికెట్లు.. నగదు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ మధుసూదన్, పీవో పద్మజ, అన్ని డిపోల మేనేజర్లు పాల్గొన్నారు.



## మెడికవర్ ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** మెడికవర్ ఆస్పత్రిలో ఓ రోగికి అరుదైన వెన్నెముక శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఈ మేరకు శుక్రవారం ఆస్పత్రిలో న్యూరో సర్జన్ శ్రీకృష్ణ వివరాలు వెల్లడించారు. చిన్నులు అనే వ్యక్తి కొంతకాలంగా వెన్నునొప్పితో బాధపడుతూ తమ ఆస్పత్రికి వచ్చారన్నారు. ఆస్పత్రికి వచ్చిన ఆయనను వివిధ రకాల పరీక్షలు చేసిన అనంతరం అతడి శరీరంలో నరాలపై ఒత్తిడి ఉందని గుర్తించి.. శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించామన్నారు. ఆధునిక సాంకేతిక పద్ధతులు, న్యూరో మానిటరింగ్ సదుపాయాలతో శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశామని తెలిపారు. ఆపరేషన్ జరిగిన మరుసటి రోజు పేషెంట్‌ను నడిపించామని.. ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితి బాగుందని వివరించారు. ఈ సమావేశంలో వైద్యుడు యజ్ఞ, సెంటర్ హెడ్ శ్రీస్వామి, మార్కెటింగ్ హెడ్ వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లాలోని డిచ్‌పల్లిలో గల తెలంగాణ విశ్వవిద్యాలయం ఆది నుంచి అక్రమాలు, అవినీతికి చిరునామాగా మారింది. విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన యూనివర్సిటీ వివాదాలకు నిలయంగా నిలుస్తోంది. అక్రమ నియామకాలు, అవినీతి ఆరోపణలు తెయూ ప్రతిష్టను దెబ్బతీస్తున్నాయి. గతంలో పలువురు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను అక్రమంగా నియమించిన విషయం తెలిసిందే. ఈ విషయం పెద్దది కావడంతో వారిని తొలగించారు. అలాగే గతంలో యూనివర్సిటీ వీసీగా పని చేసిన రవీందర్ గుప్తా లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. 2012 నియామకాలపై ఏళ్ల నుంచి వివాదం నడుస్తోంది. ఆ నియామకాలు చెల్లవంటూ తాజాగా హైకోర్టు తీర్పు చెప్పడంతో మరోసారి తెయూ వార్తల్లో నిలిచింది.

- అక్షరటుడే, ఆర్మూర్

# కిం కర్తవ్యం!

- తెయూలో 45 మంది ఆచార్యుల భవితవ్యం ప్రశ్నార్థకం
- 2012 నోటిఫికేషన్‌ను రద్దు చేసిన హైకోర్టు
- అప్పీల్‌కు వెళ్లే యోచనలో ప్రొఫెసర్లు
- అవినీతి, అక్రమాలకు అడ్డగా మారిన యూనివర్సిటీ

డిచ్‌పల్లి శివారులో జాతీయ రహదారి పక్కన తెలంగాణ యూనివర్సిటీని ఏర్పాటు చేశారు. 2012లో వీసీ అక్బర్ ఆలీఖాన్ హయాంలో పలు పోస్టుల కోసం నోటిఫికేషన్ జారీ చేశారు. 2009 బ్యాక్ లాగ్ పోస్టులు, 2011-12 సంవత్సరానికి మంజూరైన కొత్త పోస్టులు కలుపుకొని 2012లో 91 పోస్టులు భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేశారు. 2014లో ఈ నోటిఫికేషన్ ప్రకారం 53 మందిని నియమించారు. వీరిలో ప్రస్తుతం 45 మంది ఉద్యోగాలు చేస్తున్నారు. మిగతా 8 మందిలో కొందరు రిటైర్డ్ కాగా.. మరికొందరు మరణించారు.

### రోస్టర్ విధానం పాటించకుండా..

తెయూలో పోస్టుల భర్తీకి 2012లో జారీ చేసిన నోటిఫికేషన్‌లో రోస్టర్ విధానం పాటించలేదు. దీంతో పలువురు నిరుద్యోగులు 2013లో కోర్టును ఆశ్రయించారు. ఏళ్లుగా వివాదం న్యాయస్థానంలో ఉంది. అయినా కానీ సదరు నియామక ప్రక్రియ పూర్తి చేశారు. వారికి ప్రమోషన్లు ఇవ్వడానికి సైతం యత్నించారు. అయితే ఏళ్లుగా పలువురు చేసిన పోరాటం ఎట్టకేలకు ఫలించింది. సుదీర్ఘ వాదనల అనంతరం 2012 నోటిఫికేషన్ ప్రకారం చేపట్టిన నియామకాలు చెల్లవంటూ న్యాయస్థానం తీర్పు చెప్పింది. కొత్త నోటిఫికేషన్ ఇవ్వాలని ఆదేశించింది.

### అయోమయంలో ప్రొఫెసర్లు

హైకోర్టు తీర్పుతో యూనివర్సిటీలో 2014 నుంచి విధులు నిర్వహిస్తున్న ఆచార్యులు అయోమయానికి గురి అవుతున్నారు. తమ పరిస్థితి ఏంటని ఆందోళన చెందుతున్నారు. ఈ తీర్పుపై అప్పీల్‌కు వెళ్లే యోచనలో ప్రొఫెసర్లు ఉన్నట్లు తెలుస్తోంది.


### అక్రమా నియమాకాలకు కేరాఫ్‌గా..

అక్రమ నియామకాలకు కేరాఫ్ అడ్రస్‌గా తెలంగాణ యూనివర్సిటీ నిలుస్తోంది. గతంలో వీసీ సాంబయ్య హయాంలో సైతం 60 మందిని ఔట్ సోర్సింగ్ విధానంలో నియమించారు. విద్యార్థి సంఘాల ఆందోళనతో వారిని తొలగించారు. అటు తర్వాత వీసి రవీందర్ గుప్తా హయాంలో సైతం వందల సంఖ్యలో ఉద్యోగులను నియమించారు. డబ్బులు తీసుకొని ఉద్యోగాలు ఇచ్చారు. దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో పాటు విద్యార్థి సంఘాలు ఆందోళన చేపట్టాయి. దీంతో అక్రమంగా నియమించిన వారిని తొలగించారు. కాగా యూనివర్సిటీలో ఔట్‌సోర్సింగ్ విధానంలో 45 పోస్టులు మంజూరు కాగా ప్రస్తుతం 275 మంది పని చేస్తున్నారు. 230 పైగా ఉద్యోగులను యూనివర్సిటీలో పనిచేసిన పలువురు వీసీలు, రిజిస్ట్రర్లు అక్రమ పద్ధతిలోనే నియమించారనే ఆరోపణలు ఉన్నాయి. కాగా ఈ నియామకాలను సైతం ఇటీవల మంజూరు కోటాలోకి చేర్చినట్లు సమాచారం.

## జ్యోతిబాపూలే పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్



**అక్షరటుడే, ఇందల్వాయి:** డిచ్‌పల్లి మండలం రాంపూర్ గ్రామంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలను కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని స్టోర్ రూమ్, కిచెన్, డైనింగ్ హాల్ తదితర వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. స్టోర్ రూమ్‌లో నిల్వ ఉంచిన సన్నబియ్యం, కోడి గుడ్లు, ఇతర సరుకుల నాణ్యతను, విద్యార్థుల కోసం వండిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని, ఆహార పదార్థాలను భద్రపరిచే విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, పరిశుభ్రమైన వాతావరణంలో భోజనం తయారు చేయాలని ఆదేశించారు. భోజనం వండడానికి ముందే ఆహార పదార్థాల నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించాలని, కాలం చెల్లిన పదార్థాలు వినియోగించకూడదని సూచించారు. నాసిరకమైన బియ్యం, నూనె, ఇతర సరుకులు సరఫరా జరిగితే వెంటనే అధికారుల దృష్టికి తేవాలని, వాటి స్థానంలో నాణ్యమైన సరుకులను సమకూర్చేలా చర్యలు తీసుకుంటారని తెలిపారు. నిర్లక్ష్యానికి తావివ్వకుండా, మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. కలెక్టర్ వెంట తహశీల్దార్ సతీష్, పాఠశాల ప్రిన్సిపాల్ నరేందర్, స్థానిక అధికారులు ఉన్నారు.



## ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

**అక్షరటుడే, ఆర్మూర్ :** ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ కుక్కల గుట్ట వద్ద నూతనంగా నిర్మించిన ఆలయంలో వేంకటేశ్వర స్వామి విగ్రహాన్ని శుక్రవారం ప్రతిష్ఠించారు. పురోహితులు పుణ్యహవచనం నిర్వహించి యంత్ర ప్రతిష్ఠ, విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠ చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.



## వరల్డ్ కిక్ బాక్సింగ్ కరాటే చాంపియన్‌షిప్‌లో యువకుడి ప్రతిభ

**అక్షరటుడే, బోధన్:** జర్మనీ దేశంలో జరిగిన వరల్డ్ కిక్ బాక్సింగ్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో బోధన్ యువకుడు సత్తా చాటాడు. తన ప్రతిభతో కాంస్యపతకాన్ని సాధించాడు. బోధన్ పట్టణంలోని శక్కర్ నగర్ కాలనీకి చెందిన అబ్దుల్ నబీల్ జర్మనీలో జరిగిన కిక్ బాక్సింగ్ కరాటే ఛాంపియన్ షిప్‌లో తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రాతినిథ్యం వహించాడు. ఛాంపియన్‌షిప్‌లో కాంస్యపతకాన్ని సొంతం చేసుకున్నాడు. ఈ మేరకు స్వదేశానికి తిరిగివచ్చిన నబీల్‌ను బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, బోధన్ ఏసీపీ శ్రీనివాస్ ఇతర ప్రముఖులు ఘనంగా సన్మానించారు.

## డిచ్‌పల్లి – ఘన్‌పూర్ రైల్వేగేట్ మూసివేత

**అక్షరటుడే, ఇందల్వాయి:** డిచ్‌పల్లి - ఘన్‌పూర్ మధ్య రైల్వేగేట్‌ను మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. శనివారం రాత్రి పది గంటల నుంచి నుంచి ఆదివారం రాత్రి 11 గంటల వరకు గేటు మూసి వేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మార్గంలో ఎల్‌సీ గేట్ మరమ్మతుల నేపథ్యంలో గేట్‌ను మూసివేస్తున్నట్లు అధికారులు తెలియజేశారు. రైల్వేగేట్ వద్ద భద్రత ఏర్పాట్లు చూడాలని రైల్వే అధికారులు డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. అలాగే ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

## ధాన్యం కొనుగోలు సమస్యను ప్రభుత్వం పట్టించుకోవట్లేదు: ఎంపీ



**అక్షరటుడే, ఇందూరు :** సుమారు 12 ఏళ్లుగా ప్రతిసారి ధాన్యం కొనుగోలు సమస్య ఏర్పడుతోందని, అయినా ప్రభుత్వం పరిష్కారం చూపడం లేదని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. సమయానికి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం.. గన్నీ బ్యాగుల కొరత, లేబర్ కొరత, ట్రాన్స్‌పోర్టేషన్ ఇలా ప్రతి అంశంలో సమస్యలు ఏర్పడినా పరిష్కరించకపోవడం శోచనీయమన్నారు. గత ప్రభుత్వం అలాగే చేసిందన్నారు. ప్రతిసారి అకాలవర్షాలతో ఇబ్బందులు పడుతున్నా.. పట్టించుకునే వారు లేరన్నారు. రాష్ట్రం నుంచి ఎఫ్‌సీఐ 93 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం సహకారం పూర్తిస్థాయిలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం మాత్రం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. 54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కేంద్రం కొనుగోలు చేస్తామని ప్రకటించినా అలసత్వం వహిస్తున్నారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఎంపీ అన్నారు. కేవలం రాజకీయం కోసం బీసీ రిజర్వేషన్లు అంటూ డ్రామాలాడుతున్నారని విమర్శించారు. చిత్తశుద్ధి ఉంటే బీసీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలన్నారు. కేసీఆర్ సీఎం రేవంత్ రెడ్డి ములాఖత్ అయ్యారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి కేసీఆర్‌కు గులాంగిరి చేస్తున్నారని వ్యాఖ్యానించారు. గతంలోనూ నిజామాబాద్ మార్కెట్ యార్డు నిధులను సిరిసిల్లకు తరలించారన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల వ్యవహారాన్ని బీజేపీకి సంబంధించి తమ సీనియర్లు చూసుకుంటారని అర్వింద్ చెప్పారు. జూబ్లీహిల్స్‌లో కల్వకుంట్ల కుటుంబం డ్రగ్స్‌ను పెంచి పోషించిందన్నారు. గత పది ఏళ్లుగా ఏమీ అభివృద్ధి చేయకుండా ఓట్లు ఎలా అడుగుతున్నారని ప్రశ్నించారు. మాధవనగర్ ఆర్వోబీకి సంబంధించి ఇటీవల ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసినట్లు ఎంపీ అర్వింద్ తెలిపారు. రూ.14 కోట్లు విడుదల చేయాలని కోరినట్లు పేర్కొన్నారు. అందులో రూ.10 కోట్లు కేంద్రానివేనని స్పష్టం చేశారు. వాటిని కూడా విడుదల చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, రాష్ట్ర కార్యదర్శి స్రవంతి రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగోల్ల లక్ష్మీనారాయణ, పోతనకర్ లక్ష్మీనారాయణ, న్యాలం రాజు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడిన సబ్ రిజిస్ట్రార్‌ల విషయంలో ఉన్నతాధికారులు మెతక వైఖరి అవలంభిస్తున్నారు. నాన్ లే అవుట్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోవట్లేదు. నిజామాబాద్ అర్బన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో ఇటీవల జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్ల వ్యవహారం చర్చకు దారితీసిన విషయం తెలిసిందే. కాగా.. ఈ వ్యవహారంలో ఉన్నతాధికారులు ఇప్పటి వరకు బాధ్యులపై ఎలాంటి చర్య తీసుకోలేదు. కనీసం మెమో కూడా జారీ చేయకుండా చేతులు దులుపుకోవడంపై విమర్శలు వస్తున్నాయి.

- అక్షరటుడే, నిజామాబాద్



## సబ్ రిజిస్ట్రార్‌పై చర్యలేవి..

# అధికారుల తీరుపై విమర్శలు

నిజామాబాద్ నగరంలోని రోటరీ నగర్ సమీపంలో గల 12 గుంటల వ్యవసాయ భూమికి ఇటీవల రిజిస్ట్రేషన్లు పూర్తి చేసి పెట్టారు. ఓ సర్వే నంబర్‌లో పట్టాదారుకు భూ భారతిలో 12 గుంటల భూమి ఉండగా.. కేవలం నాలా పత్రాల సాయంలో ఏడు ప్లాట్లుగా విభజించారు. 8585, 8586, 8578, 8579 నంబర్లతో కలిగిన డాక్యుమెంట్లను అక్టోబర్ 10న పూర్తి చేశారు. కాగా.. ఈ వ్యవహారంపై 'అక్షరటుడే'లో కథనం ప్రచురితమైంది. విచారణ జరిపి చర్యలు తీసుకోవాల్సిన అధికారులే ఏమీ పట్టనట్లు వ్యవహరించడం గమనార్హం.

### అంతా అతడి చేతుల్లోనే..!

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో రిజిస్ట్రేషన్లకు సంబంధించి నిజామాబాద్‌లోనే డీఐజీ, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. కాగా.. మొత్తం పది కార్యాలయాలు ఉండగా, నిత్యం వందల కొద్ది డాక్యుమెంట్లు జరుగుతున్నాయి. ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేయకపోగా.. డీఐజీ కార్యాలయంలో ఉండే ఓ ఉద్యోగి పెత్తనం చలాయిస్తున్నట్లు సమాచారం. గత కొన్నేళ్లుగా ఇదే కార్యాలయంలో పాతుకుపోయిన సదరు ఉద్యోగి అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడే సబ్ రిజిస్ట్రార్లకు అండదండగా ఉంటున్నట్లు ప్రచారంలో ఉంది. రెండు జిల్లాల్లోని కార్యాలయాల్లో ఈయనకు పట్టు ఉండడంతో ఉన్నతాధికారులు సైతం ఇతగాడిపైనే ఆధారపడి పనిచేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఈ కారణంగానే అక్రమాలు జరిగినట్లు తెలిసినప్పటికీ, ఆధారాలతో సహా ఫిర్యాదులు అందినా.. చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నట్లు సమాచారం.



## కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

**అక్షరటుడే, ముప్కాల్:** కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని ఎంపీడీవో రమేష్ పేర్కొన్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రంలో వడ్లను క్వింటాలుకు రూ.2,389 ధరకు కొనుగోలు చేస్తామని తెలిపారు. రైతులు తమ ధాన్యాన్ని తేమశాతం 17 శాతానికి మించకుండా ఆరబెట్టి కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం హిమబాల, సీసీ నవీన్, పంచాయితీ సెక్రెటరీ మల్లేష్ యాదవ్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, ఐకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



**అక్షరటుడే, కమ్మర్‌పల్లి/ఆర్మూర్ :** జిల్లాస్థాయిలో కబడ్డీ, బీచ్ వాలీబాల్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయా పాఠశాలల ప్రతినిధులు శుక్రవారం వివరాలు వెల్లడించారు. కమ్మర్‌పల్లి మండలంలోని చౌట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి జాన్‌పాల్ నాయక్ అండర్-17 జూనియర్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీ లకు ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ నగేష్ తెలిపారు. ఈనెల 8 నుంచి 10 వరకు భద్రాచలం కొత్తగూడెంలో 69 వ రాష్ట్ర స్థాయి పోటీలలో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు. జాన్‌పాల్ నాయక్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓ ఆంధ్రయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

బీచ్ వాలీబాల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఆర్మూర్ మండలం మగ్గిడి ఉన్నత పాఠశాల క్రీడాకారులు ఎంపికైనట్లు పీడీ మధుసూదన్ తెలిపారు. ఈనెల 4న జక్రాన్‌పల్లి మండలంలోని కలిగోట్‌లో నిర్వహించిన ఉమ్మడి జిల్లా బీచ్ వాలీబాల్ 17 టోర్నమెంట్లో మొదటి స్థానం సంపాదించిన తమ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. క్రీడాకారులను హెచ్‌ఎం హరిత, ఉపాధ్యాయులు, గ్రామ వీడీసీ సభ్యులు అభినందించారు.



## గడ్డికి నిప్పు... ప్రయాణికులకు ముప్పు

కోటగిరి మండలంలోని పోతంగల్, కోటగిరి, రుద్రూర్‌లకు వెళ్లే ప్రధాన రహదారి పక్కన కొందరు రైతులు తమ పొలాల కోతల అనంతరం వరి కొయ్యలకు నిప్పపెడుతున్నారు. దీంతో రోడ్డు వెంట వెళ్తున్న ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఆ ప్రాంతంలో దట్టమైన పొగ కమ్ముకోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు సైతం కనిపించడం లేదని పలువురు వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాహనదారుల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని రైతులు వరికొయ్యలకు నిప్ప పెట్టవద్దని కోరుతున్నారు. - అక్షరటుడే, కోటగిరి



ఆర్ బీవీఆర్ఆర్ పాఠశాలలో వందేమాతరం సామూహిక గీతాలాపన లో పాల్గొన్న ఎంపీ అరవింద్



# సామూహిక వందేమాతర గీతాలాపన

వందేమాతరం గీతం రచించి 150వ వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఉమ్మడిజిల్లాలో వందేమాతర గీతాలాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, సంస్థల్లో శుక్రవారం సామూహికంగా గేయాన్ని ఆలపించారు.
– అక్షరటుడే, నెట్‌వర్క్


నిజామాబాద్ కలెక్టరేట్ లో..




నిజామాబాద్‌లోని పులాంగ్ చౌరస్తాలో..


బాన్సువాడ సబ్ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో..


తెలంగాణ విశ్వవిద్యాలయంలో..


కామారెడ్డి కలెక్టరేట్ ప్రాంగణంలో..


ఆర్మూర్ మున్సిపాలిటీలో...


పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలో..


ఎల్లారెడ్డి మోడల్ స్కూల్‌లో..


ఆర్మూర్ ప్రజ్ఞ పాఠశాలలో..


బాల్కొండ మండలంలో..


బోధన్ మున్సిపాలిటీలో...


కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో..


ముప్కాల్ మండల కేంద్రంలో..


నిజామాబాద్ జీజీహెచ్‌లో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో..


నిజామాబాద్‌లో..


బాల్కొండ మండల పరిషత్ కార్యాలయంలో..


ముప్కాల్ మండల కేంద్రంలో..


ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..


ఎల్లారెడ్డి ఆర్‌డీవో కార్యలయంలో..


పోతంగల్ మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో..

## రేపు ఆర్మూర్‌లో ఆర్‌ఎస్‌ఎస్ పథ సంచలన్

**అక్షరటుడే, ఆర్మూర్ :** పట్టణంలో శనివారం ఆర్‌ఎస్‌ఎస్ పథ సంచలన్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం 3 గంటలకు పట్టణంలోని నల్ల పోచమ్మ ఆలయం కమాన్ నుంచి అదే విధంగా శ్రీ వెంకటేశ్వర ఆలయం భైరవ గుట్ట నుంచి పథ సంచలన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి గణవేశ్ ధరించి ఈ సంచలన్‌లో పాల్గొనాలని కోరారు.

## రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు జిల్లాజట్టు

**అక్షరటుడే, ఇందూరు:** రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు జిల్లా జట్టు ఎంపిక చేసినట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మనోజ్ కుమార్ తెలిపారు. పోటీలు హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో ఈనెల 9న ఉన్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులను అసోసియేషన్ అధ్యక్షుడు బస్వా శ్రీనివాస్ శుక్రవారం అభినందించారు.




# అర్ధరాత్రి వాహనాల తనిఖీలు..

### 27మందిపై కేసులు నమోదు



**అక్షరటుడే, కామారెడ్డి :** రాష్ట్రంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో జిల్లా పోలీసు శాఖ అప్రమత్తమైంది. గురువారం అర్ధరాత్రి తర్వాత భిక్కనూరు టోల్ గేట్ వద్ద సీఐ సంపత్ ఆధ్వర్యంలో 8 ప్రత్యేక బృందాలు డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టాయి. అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు ఆర్టీసీ బస్సులు, ట్రావెల్స్ బస్సులు, లారీలు, కార్లు, డీసీఎంలు లాంటి 1,139 వాహనాలను తనిఖీ చేశారు. ఇందులో 27 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లుగా గుర్తించి వారిపై కేసులు నమోదు చేశారు. ఓ ట్రావెల్స్ బస్సు డ్రైవర్ 45 మంది ప్రయాణికులతో వెళ్తుండగా.. మద్యం సేవించినట్లు పోలీసులు గుర్తించి బస్సును సీజ్ చేశారు. ప్రయాణికులను ఇతర వాహనంలో సురక్షితంగా తరలించారు. ఈ సందర్భంగా ఎస్పీ రాజేష్ చంద్ర మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనం నడిపిన ప్రతి ఒక్కరిపై చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం సేవించి వాహనం నడపడం.. ప్రాణాలతో చెలగాటం ఆడటమేనని తెలిపారు. వాహనం ఏదైనా మద్యం సేవించి నడపరాదన్నారు. ప్రజల భద్రత కోసం నిరంతరం తనిఖీలు కొనసాగుతాయని చెప్పారు.

## ఆటోలో తరలిస్తున్న గంజాయి పట్టివేత

**అక్షరటుడే, బోధన్ :** వాహనాలను తనిఖీలు చేస్తున్న క్రమంలో పోలీసులకు గంజాయి లభ్యమైంది. ఈ ఘటన బోధన్ పట్టణ శివారులో చోటు చేసుకుంది. బోధన్ ఏసీపీ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. బోధన్ పట్టణ శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా.. బిలోలి నుంచి బోధన్ వస్తున్న ఆటోను పోలీసులు తనిఖీ చేశారు. ఆటోలో బిలోలికి చెందిన గోనివర్ గణేష్, బోధన్‌కు చెందిన శేఖర్, షేక్ అబ్దుల్ అనే ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి ఒక కిలో 270 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ ముగ్గురు వ్యక్తులు బిలోలి నుంచి గంజాయి తరలిస్తున్నట్లు ఏసీపీ తెలిపారు. వీరిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఆయన చెప్పారు.



## మెండోరాలో యువతకు వాలీబాల్ పోటీలు



**అక్షరటుడే, మెండోరా :** మెండోరా మండలంలో యువతకు వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్సై సుహాసిని పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం పోచంపాడ్‌లోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల లో వివరాలు వెల్లడించారు. నిజామాబాద్ కమిషనరేట్ ఆదేశాల మేరకు శనివారం వాలీబాల్ పోటీలు జరుగనున్నాయన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. చెడువ్యసనాల నుంచి మాదకద్రవ్యాల నుంచి దూరంగా ఉంచేందుకు ఈ క్రీడలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. క్రీడలతో శారీరక దృఢత్వం, మానసిక స్థైర్యం పెరగుతుందన్నారు. క్రీడలు భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడతాయని ఆమె వెల్లడించారు. పోటీలు పోచంపాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నామని పేర్కొన్నారు. స్థానిక యువత ఉత్సాహంగా పాల్గొనాలని ఎస్సై కోరారు.

## ఎల్లారెడ్డి పట్టణంలో వాటర్ పైప్‌లైన్ పనులు పరిశీలన

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పట్టణంలో అమృత్ 2.0 పైప్‌లైన్ పనులను ఏఈ నిర్భయ్ శుక్రవారం పరిశీలించారు. పట్టణంలోని బస్టాండ్ కింది ప్రాంతంతో పాటు బీసీ కాలనీ, న్యూ ఆబాది ప్రాంతంలో వాటర్ పైప్‌లైన్ పనులకు సీసీ రోడ్లు అడ్డుగా రావడంతో ఆయన శుక్రవారం పనులను పరిశీలించారు. సోమ, మంగళవారాల్లో అమృత్ 2.0పనులను ప్రారంభిస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు మహేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

